రోటిబండతండాలో విద్యార్థినితో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

బలవంతపు భూసేకరణపై పోరాటమే!

- పంట భూముల్లో ఫార్మా రద్దు చేయాలి
- సీలింగ్ భూమిలో కంపెనీలు పెట్టండి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

కొడంగల్, నవంబరు 21: రైతులకు ప్రభుత్వం నచ్చజెప్పి భూములు అప్పగించే విధానాన్ని అవలంభించాలని, బలవంతంగా భూసేకరణ చేపడితే రైతుల తరపున పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. గురువారం కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలంలోని ఫార్మా బాధిత గ్రామాలు, పొలాలను సందర్శించి బాధితుల ఆవేదనను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు పంటలు పండించే భూమిలోనే ఫార్మా కంపెనీల ఏర్పాటు విడ్డూరంగా ఉందని, వెంటనే ఫార్మా ప్రతిపాదనను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి అనుకూలంగాలేని భూముల్లో ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేస్తే అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని చెప్పారు. కొడంగల్ ప్రాంతంలో 1156 ఎకరాల సీలింగ్ భూమి ఉందని, ఆ భూమిని కాదని గిరిజనులు, పట్టాభూముల స్వాధీనం చేసుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నించడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. కలెక్టర్‌ను గుర్తించని సందర్భంలో ఘటన జరిగిందని, అటువంటి దానిపై ప్రభుత్వం రాద్ధాంతం చేయడం ఏమిటని ప్రశ్నించారు. రైతులను అర్ధరాత్రి ఇండ్లలోకి జొరబడి అరెస్టులు చేయడం అమానుషమని పేర్కొన్నారు. అరెస్టులు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

భూములు ఇచ్చే ప్రసక్తే లేదు

సీపీఎం నాయకులు ఫార్మా బాధిత గ్రామాలను సందర్శించిన సందర్భంగా మా భూములను ప్రభుత్వానికి అప్పగించేది లేదని రైతులు స్పష్టం చేశారు. భూములపైనే తమ జీవనాధారం ఉందని, భూమి పోతే ప్రాణాలు కోల్పోతామని ఆవేదన వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డిని సీఎం చేస్తే మా బతుకుల్లో కన్నీరు నింపుతాడని అనుకోలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పద్మ, న్యూ డెమాక్రసీ రాష్ట్ర నాయకులు పాపన్న, గోవర్ధన్, సీపీఐ నాయకులు రమా, అన్వేశ్, జిల్లా సెక్రటరీ విజయలక్ష్మి, సీపీఎం నాయకులు నర్సిములు, వెంకట్‌రాములు, జిల్లా కార్యదర్శి మహిపాల్, కార్యవర్గ సభ్యులు వెంకటయ్య, చంద్రయ్య, శ్రీనివాస్, వామపక్ష నేతలు పాల్గొన్నారు.

మానుకోట లంబాడాలకు భయపడ్డ రేవంత్‌రెడ్డి

ఎల్‌హెచ్‌సీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమానాయక్

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 21: మహబూబాబాద్ జిల్లా గిరిజనులకు సీఎం రేవంత్ భయపడ్డాడని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు భీమానాయక్ అన్నారు. గురువారం మహబూబాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. లగచర్ల గిరిజనులకు మద్దతుగా మానుకోటలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నాకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒత్తిడితోనే పోలీసులు అనుమతి ఇవ్వలేదని అన్నారు. కేటీఆర్ గిరిజనుల్లో చైతన్యం తీసుకొస్తారని సర్కార్ వణికిపోతుందని చెప్పారు.

కేసీఆర్ మొక్క కాదు.. మహావృక్షం

- కేసీఆర్‌ను లేకుండా చేయడం ఎవరి వల్లా కాదు
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్
- ఖమ్మంలో 'లగచర్ల' సంఘీభావ ర్యాలీ
- పాల్గొన్న ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర



ఖమ్మంలో నిర్వహించిన సంఘీభావ ర్యాలీలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర. చిత్రంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాతా మధు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తదితరులు

ఖమ్మం, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): తెలంగాణ ఉన్నంత కాలం కేసీఆర్ పేరు సజీవంగా నిలుస్తుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. మొలకెత్త నివ్వబోమనడానికి కేసీఆర్ మొక్క కాదని, మహా వృక్షమని స్పష్టం చేశారు. కేసీఆర్‌ను తుడిచిపెట్టడం రేవంత్‌కే కాదు.. అతడి జేజమ్మ వల్ల కాదని గుర్తుంచుకోవాలని హితవుచెప్పారు. ఉద్యమ సమయంలో ఉద్యమకారులను అణచివేసేందుకు జేబులో పిస్టల్ పెట్టుకొని తిరిగిన రేవంత్.. కేసీఆర్‌ను లేకుండా చేస్తానంటూ విడ్డూరంగా ఉన్నదని అన్నారు. లగచర్ల గిరిజన రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఖమ్మంలో కొవ్వొత్తులతో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. భారీ సంఖ్యలో రైతులు, గిరిజన మహిళలు, పార్టీ కార్యకర్తలు హాజరుకావడంతో ప్రధాన రహదారి కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ.. రేవంత్‌కు ఇచ్చిన రూ.100 కోట్లు అమెరికాలో అదానీ దోచుకున్న రూ.2 వేల కోట్లలోవేనా? అని ప్రశ్నించారు. ఉద్యమ సమయంలోనే చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి లాంటి ముఖ్యమంత్రులే కేసీఆర్‌ను ఏమీ చేయలేకపోయారని గుర్తుచేశారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి వల్ల మాత్రం ఏమవుతుందని ఎద్దేవా చేశారు. కేసులు, జైళ్లు వంటివి కేసీఆర్‌కు, బీఆర్ఎస్‌కు, పార్టీ క్యాడర్‌కు కొత్తేమీ కాదని స్పష్టం చేశారు. వాటికి భయపడేవాళ్లమే అయితే తెలంగాణనే వచ్చేది కాదని స్పష్టం చేశారు. లగచర్ల గిరిజనులకు జరుగుతున్న అన్యాయంపై రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడటంలేదని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ప్రశ్నించారు. ఈ నెల 25 నుంచి జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఇదే విషయమై బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఫోబియా పట్టుకుందని ఎమ్మెల్సీ తాతా మధు విమర్శించారు. కేసీఆర్‌ను తుడిచివేస్తానని అనడం సీఎం స్థాయికి తగదని అన్నారు. ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, బీఆర్ఎస్ నాయకులు లింగాల కమల్‌రాజు, రాకేశ్‌రెడ్డి, కొండబాల కొటేశ్వరరావు, కూరాకుల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్. చిత్రంలో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్ తదితరులు

నోరు మెదపవేం రాహుల్

- రేవంత్ కప్పం కడుతుండటంతోనే లగచర్ల ఘటనపై మౌనం
- 25న మానుకోటలో ధర్నా నిర్వహిస్తాం
- మీడియాతో ఎమ్మెల్సీలు సత్యవతి, రవీందర్‌రావు, నేతలు కవిత, రెడ్యా, శంకర్‌నాయక్

మహబూబాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): లగచర్లలో గిరిజన కుటుంబాలపై ప్రభుత్వం చేయించిన దాడి రాహుల్ గాంధీకి కనిపించడం లేదా? అని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి కట్టే కప్పానికి రాహుల్ గాంధీ నోరు తెరవడం లేదా? అని నిలదీశారు. గురువారం మానుకోట పట్టణంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్ తదితరులతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. లగచర్లలో 300 కుటుంబాలపై అర్ధరాత్రి కరెంటు తీసేసి, పిల్లలు మహిళలు అని చూడకుండా విచక్షణారహితంగా పోలీసులు ప్రవర్తిస్తే దానిపై రాహుల్ గాంధీ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. లగచర్లలో గిరిజన రైతులపై జరిగిన దాడిని దేశ రాజధాని ఢిల్లీలో వివరించినా ఇప్పటివరకు రాహుల్ స్పందిచకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. గురువారం మానుకోటలో నిర్వహించాల్సిన మహాధర్నాకు శాంతి భద్రతల పేరుతో పోలీసులు అనుమతి నిరాకరించడంపై మండిపడ్డారు. కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటామని, అతనిపై రాళ్ల దాడి చేస్తామని జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ గిరిజన ప్రజాప్రతినిధులు మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళి బహిరంగంగా మీడియా ముందు చెప్పినా పోలీసులు వారిపై ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ చెందిన సదరు ముగ్గురు ప్రజాప్రతినిధులపై సుమోటో కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కొడంగల్ నుంచి రేవంత్‌రెడ్డి పతనం ప్రారంభమైందని అన్నారు. రానున్న రోజుల్లో లగచర్ల ఘటనను జాతీయ స్థాయిలో తీసుకెళ్లి ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ తక్కళ్ల పల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ.. హైకోర్టు అనుమతితో ఈ నెల 25న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గిరిజన రైతుల మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు.

రాష్ట్రంలో కంచెల పాలన.. కక్షల పాలన

- రాక్షసపాలన సాగుతున్నది
- మానుకోటలో పోలీసుల లాంగ్‌మార్చ్ ఏంది?
- శాంతియుత నిరసనకు అనుమతి వ్వకపోవడం ప్రజాపాలనా?: కేటీఆర్ ఫైర్

దవాఖానల్లో విద్యార్థులు.. చెరసాలలో రైతులు

హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కొనసాగుతున్నది ప్రజాపాలన కాదని, రాక్షస పాలన అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. 'మానుకోటలో పోలీసుల లాంగ్‌మార్చ్ ఏంది? అసలు మానుకోటలో ఏం జరుగుతున్నది?' అని గురువారం ఎక్స్‌వేదికగా ప్రశ్నించారు. 'గొడవలు కాలేదు.. అసలేమీ కాలేదు.. పోలీసుల హెచ్చరికలు ఎందుకు? శాంతియుతంగా సభ నిర్వహించుకుంటామంటే అవకాశం కూడా ఇవ్వని దుస్థితి ఎందుకు వచ్చింది? అలాంటప్పుడు ప్రజాపాలన ఎలా అవుతుంది?' అని నిలదీశారు. 'ఇది నిర్బంధ పాలన.. నిరంకుశ పాలన.. కంచెల పాలన.. కక్షల పాలన.. ఆంక్షల పాలన.. మొత్తంగా రాష్ట్రంలో రాక్షస పాలన' అని నిప్పులు చెరిగారు. 'తెలంగాణను ఎంత అణచివేయాలని చూస్తే అంత తిరుబాటు లేస్తుంది.. ఖబర్దార్ రేవంత్‌రెడ్డీ' అని హెచ్చరించారు.

దవాఖానల్లో విద్యార్థులు.. చెరసాలలో రైతులు అన్నట్టుగా రాష్ట్రంలో పాలన సాగుతున్నదని కేటీఆర్ విమర్శించారు. 'తల్లికి బువ్వపెట్టనోడు చిన్నమ్మకు బంగారు గాజులు చేయించినట్టే ఉన్నది సీఎం రేవంత్‌రెడ్డి పాలన.. విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం అందించలేని రేవంత్.. మహిళలను కోటీశ్వరులను చేస్తాడట!' అని దుయ్యబట్టారు. గురుకులాల్లో రోజుకోచోట ఫుడ్‌పాయిజన్‌తో విద్యార్థులు దవాఖానల పాలవుతున్నారని, ఎన్నడూలేనిది 11 నెలల్లో 42 మంది విద్యార్థులు చనిపోయారని, పిల్లలు పిట్టల్లా రాలుతున్నా దిద్దుబాటు చర్యలు తీసుకోకుండా సీఎం రేవంత్‌రెడ్డి పిట్టలదొర మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు.

లగచర్ల గ్రామాన్ని సందర్శించేందుకు వెళ్లిన బంజారా సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి విష్ణునాయక్ తదితరులను అడ్డుకుంటున్న పోలీసులు

రేవంత్ సర్కారుకు గుణపాఠం చెబుతాం

ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి విష్ణునాయక్

బంజారాహిల్స్, నవంబర్ 21: బంజారా రైతులకు అన్యాయం చేస్తున్న రేవంత్ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి, బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ ఎస్టీ సెల్ నేత ఆర్ విష్ణు నాయక్ హెచ్చరించారు. వ్యవసాయం మీద ఆధారపడి బతికే బంజారా రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దమనకాండకు కచ్చితంగా బుద్ధి చెబుతామని తెలిపారు. లగచర్ల గ్రామంలో బంజారాలకు సంఘీభావం తెలిపేందుకు గురువారం హైదరాబాద్ నుంచి ఆలిండియా బంజారా సేవా సంఘం నాయకులు తరలివెళ్లారు. పరిగి సమీపంలోనే పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. రెండ్రోజుల నుంచి లగచర్ల వెళ్లేందుకు ప్రయత్నిస్తుంటే అడ్డుకుంటున్నారని, ఇదెక్కడి ప్రజాస్వామ్యం అని విష్ణు నాయక్ పోలీసులను ప్రశ్నించారు. తమ జాతికి అన్యాయం జరుగుతుంటే చూస్తు ఊరుకోబోమని హెచ్చరించారు. అంతకు ముందు విష్ణునాయక్, ప్రకాశ్ నాయక్, శ్రీనునాయక్, రాజు నాయక్ తదితరులను పోలీసులు అరెస్ట్ చేసి సాయంత్రం విడుదల చేశారు.

కాంగ్రెస్ కుట్రతో కడుపుమండి..

మొదటిపేజీ తరువాయి...

అయ్యాయి. రైతుల నుంచి సంతకాల సేకరణలో కీలకంగా వ్యవహరించిన ఓ కాంగ్రెస్ నాయకుడి భార్య చెప్తున్న మాటలు లగచర్ల అలజడి వెనుక సుదీర్ఘంగా, పక్కాగా పథకం అమలు చేశారని తేటతెల్లం చేస్తున్నది. లగచర్ల ఘటన తర్వాత రోటిబండతండా మాజీ సర్పంచ్ రామునాయక్ పరారీలో ఉన్నారు. ఆయన రేవంత్ అనుచరుడనీ, కాంగ్రెస్ నాయకుడనీ ఆయన భార్య రుక్కమ్మ చెప్తున్నారు. తన భర్త లగచర్ల ఘటనలో ఉన్నాడనీ, రేవంత్ టీడీపీలో ఉన్నప్పటినుంచీ ఆయన అనుచరుడిగానే ఉంటూ వచ్చాడనీ ఆమె అంటున్నారు. ఇప్పటికీ వాళ్ల ఇంట్లో రేవంత్‌రెడ్డితో రామునాయక్ దిగిన ఫొటోలు, ఇంటినిండా ఉన్న కాంగ్రెస్ జెండాలు ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. గురువారం 'నమస్తే తెలంగాణ' బృందం ఫార్మా క్లస్టర్ భూసేకరణపై నిజాలు వెలికి తీసేందుకు ప్రయత్నిస్తుండగా ఈ సంచలనాత్మక విషయం బయటపడింది.

ఆ రోజే రైతుల ఆగ్రహం

ప్రభుత్వ అధికారులు ఫార్మా క్లస్టర్‌కు నోటిఫికేషన్ విడుదల చేయడంతో విషయం బయటపడింది. రైతులు సమ్మతించారంటూ ఓ సంతకాల పత్రం అందిన తర్వాత ప్రభుత్వం ఫార్మా క్లస్టర్ ప్రక్రియను వేగవంతం చేసింది. నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ తర్వాత రైతుల భూముల క్రయవిక్రయాలను బ్యాంకులు బ్లాక్ చేశాయి. దీంతో ఆ భూమిపై రైతులకు రావాల్సిన రుణాలు, జరగాల్సిన రుణమాఫీ, ప్రభుత్వ పథకాలు ఆగిపోయాయి. విషయం తెలుసుకున్న రైతులకు కొందరు కాంగ్రెస్ నేతల పన్నాగం అర్థమైంది. దీంతో భూములు ఇచ్చేది లేదని తిరగబడ్డ తండా వాసులు ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీని ఏర్పాటు చేసి ధర్నాలు, ఆందోళనలు, నిరాహార దీక్షలు చేపట్టారు. అనేకసార్లు వికారాబాద్ కలెక్టరేట్‌కు వెళ్లి జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులకు విజ్ఞాపన పత్రాలు అందజేశారు. ఎప్పుడైతే రైతులు ఆందోళనకు దిగడం ప్రారంభించారో అప్పటినుంచి కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో కనబడకుండా పోయారు. అక్టోబర్ 25న రోటిబండతండా వద్ద తమకు ఎదురైన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్‌ను రైతులు పట్టుకున్నారు. ఫార్మాకు భూములిచ్చేందుకు మేమెప్పుడు ఒప్పుకున్నామని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ 'దొంగ సంతకాల' తీర్మానాలకు నువ్వే ముఖ్యకారకుడివంటూ దాడిచేశారు. వినతిపత్రాలంటూ సంతకాలు తీసుకుని నువ్వాడిన డ్రామా ఇదా? అంటూ ఆగ్రహంతో ఊగిపోయారు. ఆయనను ఈడ్చుకుంటూ తీసుకెళ్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బంధించారు. ప్రాణభయంతో భీతిల్లిపోయిన ఆ కాంగ్రెస్ నాయకుడు ఎవరికి ఫోన్ చేశారో తెలియదు కానీ, పోలీసులు వేగంగా అక్కడికి చేరుకున్నారు. రైతులనుంచి శేఖర్‌కు రక్షణ కల్పించి, తమ వెంట తీసుకెళ్లారు. వారు శేఖర్‌ను తప్పించకపోయి ఉంటే.. మహిళలు పంచాయతీ కార్యాలయం వద్ద అడ్డుపడకపోయి ఉంటే.. ఆ రోజే.. పెద్ద ఘోరం జరిగేదని తండావాసులు చెప్తున్నారు.

ఫార్మా వద్దని ఏకమైన తండాలు

కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలంలో ఏర్పాటు చేస్తున్న ఫార్మా క్లస్టర్ వద్దని పోలేపల్లి, హకీంపేట, పులిచర్లతండా, రోటిబండతండా, లగచర్ల గ్రామాలు ఏకమయ్యాయి. పార్టీలతో సంబంధం లేకుండా అందరూ భూములు ఇవ్వొద్దని తీర్మానించారు. భూసేకరణ వెనుక పెద్దలు ఉన్నారని, గొడవలై పోతాయని పేర్కొంటూ కొందరు బెదిరించినా.. గిరిజన రైతులు పట్టు సడిలించలేదు. తమ ప్రాణాలు పోయినా భూమి మాత్రం ఇవ్వబోమని వారంతా భీష్మించారు. రైతుల ఆగ్రహానికి భయపడిన అధికార యంత్రాంగం ప్రజాభిప్రాయ సేకరణ నేరుగా కాకుండా గ్రామాలకు వెలుపల చేపట్టేందుకు సిద్ధమైంది. అయితే పోలేపల్లి, హకీంపేటల్లో అభిప్రాయ సేకరణ జరిగినా, ఫార్మాకు భూములిచ్చేది లేదని అత్యధికులు తేల్చిచెప్పారు. లగచర్ల పరిధిలోని రోటిబండతండా, పులిచర్ల తండాల గిరిజనుల ఆందోళనలకు భయపడి దుద్యాల మండల కేంద్రానికి సమీపంలో యంత్రాంగం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ప్రతీక్ జైన్ హాజరయ్యారు. కాగా రైతులెవరూ దానికి రాలేదు. పరిస్థితి తీవ్రంగా ఉన్నదని, అందుకే గ్రామాల్లోకి వెళ్లి ప్రజాభిప్రాయాలు సేకరిస్తే అసలు విషయాలు తెలుస్తాయని చెప్పడంతో వారంతా లగచర్లకు చేరుకున్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బాసటగా..

2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ తండాలన్నీ కాంగ్రెస్‌కు అనుకూలంగా తీర్పునిచ్చాయి. రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాయి. గెలుపు సంబురాల్లో డీజేలు పెట్టుకొని రాత్రంతా డ్యాన్స్‌లూ చేశారు. రేవంత్ ఏకంగా ముఖ్యమంత్రి కావడంతో ఆ ప్రాంత కాంగ్రెస్ నాయకులు మరింత మురిసిపోయారు.

ఆ మాజీ సర్పంచ్ రేవంత్ అనుచరుడేనట!

ఫార్మా క్లస్టర్‌ను వ్యతిరేకిస్తూ లగచర్లలో జరిగిన ఘటనలో రోటిబండతండా మాజీ సర్పంచ్, రేవంత్ అనుచరుడు రామునాయక్ కూడా ప్రధాన పాత్ర పోషించినట్టు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాగా, లగచర్ల ఘటన జరిగినప్పటి నుంచీ రాము పరారీలో ఉన్నారు. అయితే ఆయన పరారీలో ఉన్నాడా? లేక కాంగ్రెస్ నేతలు దాచి ఉంచారా? అనే అనుమానాలను గ్రామస్తులు వ్యక్తంచేస్తున్నారు. రేవంత్ టీడీపీలో ఉన్నప్పటి నుంచీ రాము ఆయన అనుచరుడిగా కొనసాగుతున్నారు. గతంలో చంద్రబాబు పాదయాత్రలోనూ రేవంత్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. రెండుసార్లు కొడంగల్ ఎమ్మెల్యేగా గెలుపొందడంలోనూ రేవంత్ వెంట రాము ఉన్నారు. ఆయన అండతోనే రాము రోటిబండతండా సర్పంచ్‌గానూ పనిచేశారు. తమ గృహప్రవేశానికి స్వయంగా రేవంత్ హాజరైనట్టు రాము భార్య రుక్కమ్మ 'నమస్తే తెలంగాణ' ప్రతినిధికి వివరించారు. తన భర్త రేవంత్‌కు అత్యంత సన్నిహితుడని, ఘటన జరిగినప్పటి నుంచీ ఆయన పరారీలో ఉన్నాడని ఆమె చెప్తున్నారు. ప్రస్తుతం తన ఫోన్ స్విచ్‌ఆఫ్ వస్తున్నదని, ఎక్కడున్నాడో ఇంతవరకు ఆచూకీ లేదని రుక్కమ్మ పేర్కొన్నారు. అయితే ఇక్కడే పలు ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. మాయచేసి సంతకాలు, ఫార్మా తీర్మానాలు, రైతుల ఆగ్రహానికి కారణాలైతే.. వాటికి కారణమైన కాంగ్రెస్ నాయకులే లగచర్ల తిరుగుబాటుకూ కారణం. కానీ, నవంబర్ 11 నాటి ఘటనను మొత్తం బీఆర్ఎస్‌కు అంటగట్టి, ఆ ఆరోపణల జడిలో అసలు కారకులను తప్పించే ప్రయత్నమూ జరిగింది. లగచర్ల ఘటనలో సుమారు 11మంది కాంగ్రెస్ నాయకుల పేర్లు వినిపిస్తున్నాయి. నలుగురు మాత్రమే రిమాండ్‌లో ఉండగా, మిగిలిన వారంతా పరారీలో ఉండటం గమనార్హం.

■ ఫార్మా క్లస్టర్ తీర్మానం వెనుక..

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన లగచర్ల ఘటన వెనుక కాంగ్రెస్ నాయకుల ప్రమేయం ఉన్నదని తాజాగా వెలుగులోకి వచ్చింది. ఆరు నెలల కిందటి నుంచే కొందరు నాయకులు పథకం ప్రకారం కథ నడుపుతూ వచ్చారని తెలుస్తున్నది. గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని, ముఖ్యమంత్రిని కలుద్దామని దుద్యాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్‌తో పాటు శ్రీనివాస్ (హకీంపేట), సంజీవరెడ్డి(హకీంపేట), నర్సింహ (పోలేపల్లి), సింగర్ నర్సింహ (పోలేపల్లి) తమ గ్రామాల్లో ప్రచారం చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. రెండు బస్సుల్లో హైదరాబాద్ వెళ్లి ముఖ్యమంత్రిని కలుద్దామని, తాను అపాయింట్‌మెంట్ తీసుకుంటానని శేఖర్ చెప్పి నమ్మించిండంటూ వారు చెప్తున్నారు. ఆ తర్వాత వినతిపత్రాల డ్రామా నడిపించి, కొందరు రైతుల నుంచి సంతకాలు సేకరించడం.. ఆ తర్వాత ఫార్మా క్లస్టర్‌కు అంగీకరిస్తున్నట్టుగా వాటిని తీర్మానాలుగా మలచడం చకచకా జరిగిపోయాయి.

■ తమకేమీ తెలియనట్టు!

లగచర్ల ఘటన తర్వాత కొందరు పెద్దలు రంగంలోకి దిగి ప్రధాన అంశాన్ని పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించారని విమర్శలు వినవస్తున్నాయి. రైతుల తిరుగుబాటు వెనుక అసలు కారణాలను వెలుగులోకి రాకుండా వారు తొక్కిపెట్టారని, కారకులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ నాయకుల పేర్లు బయటకు రాకుండా ఉండేందుకు ప్రయత్నించారని బాధిత రైతు కుటుంబాలు చెప్తున్నాయి. ఘటన జరిగిన మరుక్షణం నుంచే బీఆర్ఎస్ కార్యకర్త సురేశ్ ప్రధాన సూత్రధారి అంటూ లీకులు వచ్చాయి. అంతటితో ఆగకుండా ఘటన జరిగిన రోజు ఆయన ఒకే ఒక్క కాల్ చేస్తే.. 80సార్లు మాజీ ఎమ్మెల్యేతో ఫోన్లో మాట్లాడారని సోషల్ మీడియాలో పోస్టులు ప్రత్యక్షమయ్యాయి. ఏకంగా మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ప్రోద్బలంతోనే జరిగిందని ఆరోపిస్తూ.. జరిగిన ఇష్యూని ఆయన మెడకు చుట్టేందుకు ప్రయత్నాలు జరిగాయి. పట్నంను ఏకంగా అరెస్టు చేసి జైలుకు పంపించారు. కాగా ఈ ఘటనకు సంబంధం లేని లగచర్ల గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శిని సైతం కేసులో ఇరికించి సస్పెండ్ చేయించారు. ఈ కుట్రల వెనుక కొందరు పెద్దల హస్తం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. మొత్తమ్మీద లగచర్ల జ్వాల ఇప్పట్లో చల్లారేలా కనిపించడం లేదు. మంటలు తగ్గుతున్న కొద్దీ నిప్పును రగిల్చిన మరికొందరి గుట్టు బయటపడేలా కనిపిస్తున్నది.